క్లుప్తంగా

అశ్వ వాహనంపై కోటేశ్వరస్వామి



సంగం: మండలంలోని దువ్వూరులో జరుగుతున్న గంగాపార్వతి సమేత కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధ రాత్రి అశ్వ వాహన సేవను వైభవంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవమూర్తులను అశ్వ వాహనంపై కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు తమ ఇంటి ముంగిటకు వచ్చిన దేవదేవరులను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

కాలువలో పూడికతీత పనులు ప్రారంభం



చేజర్ల (ఆత్మకూరు): చేజర్లలోని పెద్దచెరువు ఆయకట్టు పొలాలకు సాగునీరు అందించే ఊటకాలువలో పూడికతీత పనులను శనివారం ప్రారంభించారు. రెండోకారు సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్న తరుణంలో సాగునీరు సజావుగా అందేలా ఇరిగేషన్ శాఖ ఆధీనంలో ప్రొక్లయినర్ సాయంతో చేపడుతున్న పూడికతీత పనులను రైతులు దగ్గరుండి చేయిస్తున్నారు. సోమశిల దక్షిణ కాలువ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, చెరువు సాగునీటి సంఘం చైర్మన్ గోపిరెడ్డి, షేక్ సిరాజుద్దీన్, లక్ష్మిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని కే జ్ఞానసిరికి వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు, డాక్టర్ వీ దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జే ప్రణీత్ శనివారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని ఆమె తండ్రికి నగదు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుమార్, తోడేటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



ఆనంద్‌రావు కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న గడ్డం శ్రీనివాసులురెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని నువ్వూరుపాడు పంచాయతీకి చెందిన బాధిత కుటుంబాలకు పాతజంగాలపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గడ్డం శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఎస్టీకాలనీకి చెందిన దేవరపాటి ఆనంద్‌రావు శనివారం మృతి చెందగా కుటుంబసభ్యులకు నగదు సాయం అందజేశారు. అలాగే ఇటీవల మరణించిన వ్యక్తులకు సంబంధించిన రెండు బాధిత కుటుంబాలకు నగదు సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తన సోదరుడు దివంగత విజయభాస్కర్‌రెడ్డి దశాబ్దకాలం పాటు నువ్వూరుపాడు పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారని తెలిపారు. ఆయన రాజకీయాలతో సంబంధం లేకుండా దురదృష్టవశాత్తు ఎవరైనా చనిపోతే అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేసేవారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు కొనసాగింపుగా ఇటీవల చనిపోయిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు.

పెళ్లికానుక అందజేత

సీతారామపురం : మారంరెడ్డి పల్లి పంచాయతీకి చెందిన వడ్డేపల్లి స్వప్నకు పెళ్లికానుక కింద రూ.10వేలు నగదును ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన కాకర్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేశారు. శనివారం టీడీపీ నాయకుల చేతుల మీదుగా స్వప్నకు నగదును పంపిణీ చేశారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గ జనసేన నాయకుడు భోగినేని కాశీరావు సహకారంతో మండల నాయకులు భోగినేని సులోచనమ్మ, భోగినేని కాశీరత్తయ్య పెళ్లికానుకగా రూ.5వేలు నగదును స్వప్నకు అందజేసి ఆశీర్వదించారు. నాయకులు కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, నవీన్ పాల్గొన్నారు.

ఎడగారు సాగేనా?

- సోమశిలలో పుష్కలంగా జలాలు
- దక్షిణకాలువ ద్వారా అందని సాగునీరు
- ఎండిపోతున్న నారుమడులు
- ఆందోళనలో అన్నదాతలు

ఆత్మకూరు: ఈ ఏడాది జిల్లా వరదాయని సోమశిల జలాశయంలో పుష్కలంగా నీరు ఉండడంతో జిల్లా సాగునీటి సలహామండలి ఎడగారు సాగుకు అనుమతించింది. దీంతో దక్షిణకాలువ పరిధిలోని రైతులు ఎడగారు సాగుకు నార్లు పోసుకున్నారు. అయితే దక్షిణ కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందక నారుమడులు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దక్షిణ కాలువ ఆయకట్టు పరిధిలోని చేజర్ల మండలం యనమదల, బిల్లుపాడు, తూర్పుకంభంపాడు, ఉలవపల్లి, తదితర గ్రామాల్లో 100 నుంచి 300 ఎకరాల వరకు ఎడగారు సాగు చేసేందుకు నారుమడులు పోశారు. దుక్కులు సైతం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ దశలో సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే, నాట్లు వేశాక పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆవేదన చెందుతున్నారు.

సాగునీరు అందేది ఇలా....

చేజర్ల మండలంలోని గ్రామాలకు సోమశిల దక్షిణ కాలువ నుంచి రెండు మార్గాల్లో సాగునీరు అందుతుంది. ఒక మార్గంలో కలువాయి చెరువు నుంచి బ్రాంచ్‌కెనాల్ ద్వారా కాకివాయి, తోపుగుంట, అగ్రహారం, నాగలవెలటూరు వరకు అందుతాయి. అక్కడి నుంచి నల్లవాగులో కలిసి బిల్లుపాడు, యనమదల, టీకేపాడు గ్రామాలకు సాగునీరు అందుతుంది. మరో మార్గంలో కలువాయి మండలం యదనపర్తి చెరువు నుంచి చిన్నగోపవరం, పెదగోపవరం మీదుగా నల్లవాగులో కలిసి చేజర్ల మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందుతుంది. అయితే ఈ ఏడాది ముందస్తుగా ఎడగారుకు సాగునీరు ఇస్తామని చెప్పినా సక్రమంగా అందక నారుమడులే ఎండిపోతుండడంతో సాగు ఎలా చేపట్టాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. కండలేరు బ్యాక్‌వాటర్‌ను యదనపర్తి చెరువు మీదుగా నల్లవాగులోకి కలపడం రివాజు. అయితే ఈ ఏడాది అది జరగకపోవడంతో రైతులు సాగు ఎలా చేపట్టాలని మదనపడుతున్నారు.



సాగునీరు అందక ఎండిపోతున్న నారుమడి

దక్షిణ కాలువ సామర్థ్యాన్ని పెంచకపోవడంతోనే..

సోమశిల జలాశయం దక్షిణ కాలువ ద్వారా సుమారు 400 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని అధికారుల అంచనా. అయితే పలు చోట్ల దక్షిణ కాలువ దెబ్బతినడం, లీకేజీలతో నీరు వృథాగా పోతుండడం, తదితర కారణాలతో పూర్తి స్థాయిలో సాగునీరు చెరువులకు చేరడం లేదు. తొలి పది గ్రామాల్లోని చెరువులు మాత్రమే నిండుతున్నాయి. మధ్య, చివరి ఆయకట్టు గ్రామాలకు సాగునీరు అందడంలేదని రైతులు తెలిపారు. దీనికితోడు ఇటీవల దక్షిణ కాలువ గేట్లు మొరాయించడంతో సాగునీరు సకాలంలో విడుదల చేయలేదని సమాచారం.

పట్టించుకోని నాయకులు, అధికారులు

సోమశిల దక్షిణ కాలువకు సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చూడడంలో నాయకులు, అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని చేజర్ల, పొదలకూరు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. చేజర్ల మండలం నాగలవెలటూరు గ్రామానికి చెందిన కేశవ చౌదరి సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. అలాగే చేజర్ల గ్రామానికి చెందిన ప్రసాద్ రెడ్డి దక్షిణ కాలువ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. అయినా దక్షిణ కాలువ గురించి శ్రద్ధ తీసుకోకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రెండు వేల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకం

సోమశిల దక్షిణ కాలువ కింద చేజర్ల, పొదలకూరు మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. ఈ ఏడాది దక్షిణ కాలువ ద్వారా సాగునీరు సక్రమంగా అందని కారణంగా రెండు వేల ఎకరాల్లో ఎడగారు సాగు ప్రశ్నార్థకం కానుంది. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి నారుమడులు పోసి దుక్కులు దున్నుకుని నాట్లు వేసేందుకు సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతులు నష్టపోనున్నారు.

నష్టపోతాం



ఈ ఏడాది ఎడగారుకు సాగునీరు ఇస్తామని ఐఏబీ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా ప్రకటించారు. ఆ మేరకు సాగునీరు సరఫరా చేసేందుకు చొరవచూపాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దక్షిణ కాలువ ద్వారా సాగునీరు అందకుంటే తీవ్రంగా నష్టపోతాం.

– పెంచల నరసింహులు,రైతు టీకేపాడు, చేజర్ల మండలం

50వేలకుపైగా పెట్టుబడి పెట్టా



నేను 8 ఎకరాల్లో ఎడగారు సాగు చేసేందుకు నారుమడి పోశా. నారు నాటుకు వచ్చింది. అయితే గత ఐదు రోజులుగా సాగునీరు అందకపోవడంతో నారుమడులు ఎండుతున్నాయి. ఇప్పటికే దుక్కి, నారుమడులు, విత్తనాల కొనుగోలు కోసం రూ.50వేలకుపైగా పెట్టుబడి పెట్టా. సాగునీరు అందకపోతే తీవ్రంగా నష్టపోతా. అధికారులు స్పందించి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

–వెంకటరమణయ్య, రైతు తూర్పుకంభంపాడు, చేజర్ల మండలం

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



ఉదయగిరి: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.అనంతరం సీతారాముల గ్రామోత్సవం జరిపారు.

వైభవంగా నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



సోమశిల: సోమశిల జలాశయం సమీపంలో పెన్నానది తీరంలో ఉన్న పరమానంద ఆశ్రమంలో నాలుగురోజులుగా నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని చిన్నజీయర్‌స్వామి దివ్యమంగళ శాసనములతో వేడుకగా జరిపారు. ఉభయకర్తకర్తలుగా చతుర్వేదల వెంకటరమణ దంపతులు వ్యవహరించారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



సీతారామపురం: సూర్యనమస్కారాలు చేస్తున్న అధికారులు



అనుమసముద్రంపేటలో యోగాడే అక్షరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కలిగిరి మండలం నాగసముద్రంలో..

సీతారామపురం : నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన యోగా శిక్షణ శిబిరంలో తహసీల్దార్ మాట్లాడారు. ప్రతిఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో యోగాసనాలు వేయించారు. డిప్యూటీ ఎంపీడీవో భార్గవిరెడ్డి, సచివాలయ, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండలంలోని కావలియడవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ విద్యార్థులు యోగాడే అనే అక్షరమాలను ప్రదర్శించారు.

సంగం: మండలంలో ఎంపీడీఓ షాలెట్ ఆధ్వర్యంలో సామూహిక యోగా కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని 13 సచివాలయ పరిధిలోని 117 ప్రాంతాల్లో యోగాపై అవగాహన కల్పించినట్లు ఎంపీడీఓ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శిక్షకులు యోగాసనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నరసయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం యోగాపై శిక్షణ ఇచ్చారు. కరటంపాడు, ఆరవేడు జంగాలపల్లి, మహిమలూరు, తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో యోగాసనాలను వేయించారు.

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని ఆరు సచివాలయాల్లో శనివారం యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం యోగాసనాలు వేయించారు. నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, డీడీఓ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు సుజాత, పెనుగొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: మండలంలోని నాగసముద్రం పంచాయతీ పరిధిలోని తొమ్మిది ప్రాంతాల్లో ఈఓపీఆర్డీ వెలుగోటి మధు ఆధ్వర్యంలో యోగాపై శిక్షణా తరగతులను శనివారం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు వివిధ యోగాసనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ దమ్ము శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జలదంకి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జలదంకి, చినక్రాక ఆయుర్వేద వైద్యులు విజయకుమారి, చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు సిబ్బందికి యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ బ్రహ్మయ్య పాల్గొన్నారు.



సంగంలోని మండల పరిషత్ కార్యాలయంలో..



ఆత్మకూరురూరల్: కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



జలదంకి మండల పరిషత్ కార్యాలయంలో...

రక్తదానంతో ప్రాణదానం

ఆత్మకూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఆర్టీసీ డిపో వరకు రక్తదానంపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ ర్యాలీని సూపరింటెండెంట్ ప్రారంభించి మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ఏడాదికి మూడుసార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి రక్తదానం చేయడంతో పాటు రక్తదానాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఆర్ఎంఓ డాక్టర్ ఉషా సుందరి, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఆస్పత్రి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు జే బెనోమి, సునంద, కవిత, సుస్మిత, మొబీనా, జయంతి, నూర్జాహాన్, ఉమా, సుగుణ, భార్గవి, ఝాన్సీ, అనూషా, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ శేషారత్నం

రక్తదానంపై అవగాహన

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని మాసిలామణి చిన్న పిల్లల వైద్యశాలలో విశ్రాంత డీఎంహెచ్ఓ మాసిలామణి రక్తదానంపై అవగాహన కల్పించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయడాన్ని అలవాటుగా మార్చుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ నిర్వహించే రక్తదాన శిబిరాలను సద్వినియోగం చేసుకుని రక్తదానం చేయాలని కోరారు.

టీం సేవియర్స్‌కు రెడ్‌క్రాస్ పురస్కారం



మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రణీత్

కావలి (జలదంకి): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గుంటూరులోని భారతీయ విద్యాభవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తసేకరణలో ప్రతిభ చూపిన రెడ్‌క్రాస్ శాఖలకు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతుల మీదుగా పురస్కారాలను అందజేశారు. అందులో భాగంగా 2023–24, 2024–25 సంవత్సరాలకు గానూ కావలి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకుకు పురస్కారాన్ని అందజేశారు. 2023–24లో ఒకేరోజే అత్యధిక సంఖ్యలో రక్తదాతలతో రక్తదానం చేయించి కావలి రెడ్‌క్రాస్‌ను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపిన సేవియర్స్ వలంటరీ ఆర్గనైజేషన్ (టీం సేవియర్స్) అధ్యక్షుడు నల్లిపోగు ప్రణీత్ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా ప్రణీత్ మాట్లాడుతూ 2023 అక్టోబర్ 13న టీం సేవియర్స్ ఆధ్వర్యంలో కావలిలో మెగా రక్తదానం నిర్వహించి 614 మందితో రక్తదానం చేయడంతో రాష్ట్రస్థాయి పురస్కారం దక్కిందన్నారు. అందుకు సహకరించిన కావలి రెడ్‌క్రాస్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

హడలెత్తిస్తున్న గ్రామసింహాలు



కుక్కకాటుతో ఓ వ్యక్తి కాలుకు ఏర్పడిన గాయం



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

దుత్తలూరు : దుత్తలూరు పంచాయతీ పరిధిలో గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రధానంగా దుత్తలూరు గ్రామం, సెంటర్, బీసీ కాలనీ, ఎట్టి పాలెం, తదితర ప్రాంతాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. నిత్యం ఏదోక ప్రాంతంలో ప్రజలు కుక్కకాటుకు గురవుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇటీవల బీసీ కాలనీలోకి వెళ్లిన దుత్తలూరుకు చెందిన వ్యక్తిపై కుక్క దాడి చేసి కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. రెండ్రోజుల క్రితం విధుల్లో భాగంగా హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఎట్టిపాలెం వెళ్లగా కుక్క కాటేసింది. గొర్రెల మందలపై కుక్కలు దాడిచేసి గాయపరుస్తుండటంతో జీవాల పెంపకందారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా

దుత్తలూరు: నర్రవాడ పంచాయతీ పరిధిలోని ఎస్సీ బాలుర వసతిగృహం సమీపంలో ఉన్న కాలనీలో మంచినీటి పైప్‌లైన్ పగిలిపోయి గత కొన్నినెలలుగా తాగునీరు వృథాగా పోతోంది. దీంతో తాగునీరు కలుషితమవడంతో పాటు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారడంతో స్థానికులు రోగాల బారినపడుతున్నారు. మరోవైపు పైపులైన్ లీకేజీ వద్ద గడ్డి, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి విషపురుగులకు ఆవాసంగా మారతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పైపులైన్ లీకేజీని అరికట్టి మురుగు నిల్వలేకుండా చూడాలని వేడుకుంటున్నారు.



పైప్‌లైన్ లీకేజీతో ఇళ్ల సమీపంలో నిల్వ చేరిన నీరు


కలిగిరిలో 315 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం 315 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 486 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 315 బేళ్లను కొనుగోలు చేశారని, మిగిలిన బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారని వివరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ. 180, సరాసరిన రూ. 242.73 ధర పలికిందని చెప్పారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 517 బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 517 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 741 బేళ్లు రాగా, 517 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలోపొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.180, సగటున రూ.235.79 ధర పలికిందని వివరించారు. వేలంలో పది కంపెనీలకు చెందిన వ్యాపారప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

సాగునీటి కాలువలో హోటళ్ల వ్యర్థాలు



కాలువలో తేలుతున్న వ్యర్థాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న సాగునీటి పారుదల కాలువలో స్థానిక హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను పడేస్తున్నారు. ఆరవేడు జంగాలపల్లి వద్ద ఉన్న బొగ్గేరు నుంచి మహిమలూరు పెద్ద చెరువుకు సాగునీరు సరఫరా చేసే ఈ కాలువలో టిఫిన్ ప్లేట్లు, ప్లాస్టిక్ సీసాలు, తదితర వ్యర్థాలను పడేస్తున్నారు. అవి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో గ్రామస్తులతో పాటు బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంచాయతీ అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలాధికారులు స్పందించి కాలువల్లో వ్యర్థాలను పడేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.